

# క్షమార్పణం

గోపరాజు నారాయణరావు

ఆకురాల్చిన అడవిలో అద్భుతంగా వుంది ఉషోదయం. ఏడొంపుల ఘాట్‌రోడ్డు మొదటి ఒంపు తిరిగాక కారు విండోలో ఒదిగిన ఆ దృశ్యం వెన్నంటి వస్తూనే వుంది.

ఒట్టి చిటారు కొమ్మల మధ్య, ఆకుల ఆచ్ఛాదన లేని శాఖల వెనుక, కాశ్మీర్ యాపిల్‌పండు రంగు ఇన బింబం- ఎర్రటి, పల్చటి ఉదయఛాయలో ఒక సిల్హౌట్ లా కనిపిస్తున్న ఎగుడుదిగుడు అవతలి కొండ మీద అప్పుడే ఉదయించిన బింబం- చాలా సుందరంగా వుంది.

స్థిమితంగా, నిశ్చలంగా కాసేపు అది చూడాలనే కారు ఆపించారు ప్రొఫెసర్ పాల్. వెనక డోర్ తెరిచి దిగి, చేతికర్ర ఇమ్మన్నారు. అది తీసుకుని నేనూ దిగాను.

ఇక్కడ నుంచి కొయ్యూరుకి ఇంకో అరగంట పడుతుంది. విశాఖ మన్యంలో ఓ మూలగా వున్న కొండ గ్రామం.

అక్కడికే ఈ ప్రయాణం!

ఘాట్‌రోడ్డుకి లోయవైపు నిర్మించే బండరాళ్ల పిట్ట గోడ మీద కూర్చున్నారు పాల్. ఈ రోడ్డునే చింతాలమ్మ ఘాటీ అంటారని, అసలు పేరు ఏడొంపుల ఘాట్ అని చెప్పారు ఇంగ్లీషులో. కృష్ణదేవిపేటకి, కొయ్యూరుకి మధ్యలో వుందీ ఘాట్.

"ఐదు నిమిషాలాగి వెళ్లిపోదాం! సిట్ ఫరే వైల్."

సిగిరెట్ ముట్టిస్తూ అన్నారు పాల్. సంభాషణంతా ఇంగ్లీషులోనే.

కిందనే లోయ. కంటికి అందీ అందని నేలమట్టం నుంచి లోయ అంచుల మీదుగా అంబరాన్ని చుంబి స్తున్న మహావృక్షాలు. బూడిద రంగు బెరడుని, నల్లటి మానుని, మొసళ్ల ఒంటిని మరిపించేవి- రకరకాలు. దేనికీ లేదు ఆకు. లేత వెలుగు రేఖలు, చల్లటి కొండ గాలి, అది చేసే సవ్వడి, పక్షుల వింతవింత చప్పుళ్లు... మనస్సనేది జీవితకాలంలో ఏ కొన్ని లిప్తలయినా మమేకం కావలసిన స్థితి అనిపిస్తోంది.

"పోరాటాల్లోను, యుద్ధాల్లోను నిష్కారణంగా ప్రాణాలు పోగొట్టుకున్న వాళ్లకి; వివక్ష వల్ల చితికిపోయిన జాతులకి నివాళులర్పించడం; వాళ్ల వారసులకి క్షమా పణలు చెప్పడం నిజాయితీగా జరిగితే ఒక మంచి సంప్ర దాయమేననిపిస్తుంది. సెకెండ్ వరల్డ్ వార్ సమయంలో తన సైనికుల మూలంగా ఈ భూమ్మీద తయారయిన తండ్రుల నెరుగని ఒక సమూహానికి జపాన్ క్షమాపణ చెప్పింది. గుర్తుందా? హిరోషిమా మీద అణుబాంబు వేసిన వాడు పశ్చాత్తాపపడటం, మొన్నమొన్న జలియన్ వాలాబాగ్‌లో బ్రిటిష్ రాణి నివాళి..."

చిన్న లెక్చర్‌తో హఠాత్తుగా ఈ విషయం ఎత్తారు ప్రొఫెసర్ పాల్.

"దానివల్ల ప్రయోజనం ఏమిటంటారు!?"

నా యీ మాటకి జోక్ పేల్చినట్లు నవ్వారు పాల్. కారు దగ్గరకొచ్చి డోరు తీస్తూ అన్నారు-

"గొప్ప ప్రయోజనం అంటే... నాకూ అనుమానమే. కానీ, రక్తపంకిల ఘటనలకి కన్నీరద్దాలన్న స్పృహ కలుగు తోంది. చాలదూ! ఒక్కటి చెప్పండి. హిస్టరీ రీసెర్చిని నిన్నటిదాకా శాసించిన ఆర్థిక కారణాలు అనే కాన్సెప్ట్ ప్రయోజనం వర్తమాన సమాజంపైన ఎంతమేరకు వుంది? ఆ కారణాలతోపాటు వాటి ఫలితాలని ప్రత్యక్షం గా అనుభవించిన సమాజం, లేదా తరం, ఇంకా చెప్పా లంటే ఆ వర్గం పడిన సంఘర్షణకి, ఇలాంటి సంఘ ర్షణని ప్రతిబింబించే సంఘటనలకి చరిత్ర రచనలో ఏ మూలయినా వుందా చోటు? కరవు కాటకాలతో,

యుద్ధాలు పోరాటాలతో, వలసల స్థాపన మూలంగా అనంతమైన ఆ కాలగమనం మీద కురిసిన కన్నీళ్లు న్నాయి చూడండి! వాటి గురించి నేనంటున్నాను. ఆ స్రవంతిని చరిత్రకారులు పట్టించుకునే రోజు రావాలి. ఇందువల్ల చరిత్ర నుంచి గుణపాఠం మాటేమోగాని, తరువాతి తరాలలో పరివర్తనకి ఆస్కారమిస్తుందేమో, ప్రేరణ కలిగిస్తుందేమో ఆలోచించాలి!"

లేడి కన్నీళ్లు వేటగాడి మనసుని కరిగించవన్న మన తెలుగు పాఠాన్ని ఆ అస్సామీ పెద్దాయనకి తిరిగి అప్పజెబుదామనిపించింది.

మధ్యమధ్య హెయిర్ పిన్ బెండ్‌లాంటి ఒంపులు తిరుగుతూ నెమ్మదిగా పోతోంది కారు.

అదేదో అస్సాం యూనివర్శిటీలో హిస్టరీ ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు పాల్. గడిచిన జనవరిలో ఆంధ్రా యూనివర్శిటీలో జరిగిన సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సభల్లో మా ఇద్దరికీ పరిచయమైంది. నా రీసెర్చి డైరెక్టరే తగిలించారు. పాల్‌గారి స్పెషలైజేషను, నా రీసెర్చి టాపిక్ ఒక్కటే- గిరిజన పోరాటాలు. ఆ సందర్భంలోనే అడిగారు పాల్.

"అదేమిటి? ఖయూరా? ఖుయూరా అదెక్కడ?"

అస్సామీ ప్రభావంతో ఆయన నోటి నుంచి ఆ మాట విన్నప్పుడు నాకు మతిపోయింది. చివరికి దాని స్పెల్లింగు, జిల్లా పేరు రాసి చూపించాక, అర్థమైంది. పాల్‌గారు అడుగుతున్నది- విశాఖ మన్యంలోని కొయ్యూరు గురించే.

సిటీకి దాదాపు వంద కిలోమీటర్లని, అల్లూరి సీతారామరాజు సాగించిన గిరిజన పోరాటంలో అది కూడా యుద్ధభూమేనని చెప్పాను. అంతే- అమాంతం నా భుజాలు పట్టుకుని, "ఎస్... ఎస్..." అని ఊపేస్తూ ఆర్ట్స్ కాలేజి ఫస్ట్ ఫ్లోర్ నుంచి కింద పడేసినంత పనిచేశారు పాల్‌గారు.

మరు నిమిషంలోనే, విశాఖకి ఇంత దగ్గరని తెలిస్తే తన తల్లికి కూడా చూపించి వుండేవాడినని, అయితే ఆమె పోయి ఏడేళ్లవుతోందంటూ డీప్ సారో కూడా ప్రకటించారు.

ఆ మారుమూల కొండ గ్రామాన్ని ఆ అస్సామీ అవ్వగారికి ఎందుకు చూపించాలో, చూపించలేదని అంత ఇదైపోవడం ఎందుకో ఆ క్షణంలో నాకు అర్థం కాలేదు. తను మాత్రం చూడాలని, నా సహాయం కావాలని మరీమరీ కోరారు పాల్. అప్పటి నుంచి 'అదిగో' 'ఇదిగో' అంటూ ఈ మార్చి మధ్యలో విశాఖ మన్యం చూడాలనే వచ్చారు.

పాల్‌గారి వయసు డెబ్భై పై మాటే. గూర్ఖావాడో ఏమిటో! మరీ పొడుగూ కాదు, పొట్టీ కాదు. తెల్లటి ఒళ్లు, కళ్ల దిగువన పెన్సిల్‌తో గీసినట్టున్నాయి సన్నటి ముడతలు. పొడుచుకొచ్చిన నుదురు. రాగిరంగు వెంట్రుకల కనుబొమ్మలు. నాగాలాండ్, సిక్కిం ముఖ్యమంత్రుల ఫొటోలు గుర్తొస్తాయి. అదేం ఓపికో పెద్దాయనకి! చరిత్ర పరిశోధనతోపాటు ప్రకృతి ఆరాధన ఒకటి. అసలు చరిత్ర పేరుతో ఎక్కడ ఏ సభ జరిగినా పాల్ గారు రెడీయేనట. నిన్న ఉదయం యూనివర్శిటీ గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరాం ఇదే టాక్సీలో చిన్నపాటి లగేజీతో, ఇద్దరమే. ఎవరిచ్చారో, ఖరీదైన ఒక బొకేని చాలా అపురూపంగా వెంట తెచ్చుకున్నారు పాల్.

నిన్నంతా ప్రయాణమే!

నర్సీపట్నం నుంచి మొదలయింది మా చారిత్రక స్థలాల సందర్శన.

"కొయ్యూరు దగ్గరలో కూడా ఇలాంటి సమాధులున్నాయా?"

నర్సీపట్నంలోనే బలిట్టం అని పిలిచేచోట కట్టారు రెండు సమాధులు. వాటిని చూసినపుడు చాలా ఆత్రంగా అడిగారు పాల్. క్రైస్తవ సంప్రదాయం ప్రకారం శిలువలతో పక్కపక్కనే కట్టారు. ఒకప్పుడు పార్కుట అది. ప్రస్తుతం పాయఖానాలా వుంది. కవర్ట్, హైటర్ అనే ఇద్దరు సేనానులు దామనపల్లి దాడిలో చనిపోయారని వాటి మీద చక్కగా చెక్కారు.

"కృష్ణదేవిపేటలో చూడొచ్చు మాస్టారు," అన్నాను.

"అంటే- కే.డి. పేటేనా?" ఒత్తి పలుకుతూ అన్నారు పాల్.

"ఈ సంగతి ఈయనకెలా తెలుసో, ఎక్కడ విన్నాడో అనుకుంటూనే ఔనని తలూపాను.

నెమ్మదిగా కృష్ణదేవిపేట చేరాం.

దాదాపు నలభయ్ నిమిషాల ప్రయాణంలో సీతారామరాజు గురించి పాల్ అడిగిన అన్ని సందేహాలకి సమాధానమిచ్చే ప్రయత్నం చేశాను.

విశాఖజిల్లాలోని పాండ్రంకిలో అల్లూరి సీతారామరాజు పుట్టడం దగ్గర నుంచి, మోగల్లులో గడిచిన బాల్యం, ఆయన తండ్రి రాజమండ్రిలో స్టూడియో పెట్టడం, దేశభక్తుల ఫొటోలు తీయడం, వందేమాతరం ఉద్యమం, కాకినాడ పి.ఆర్. విద్యాసంస్థలో రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు ప్రిన్సిపాల్‌గా వుండగా రామరాజు చదవడం, తండ్రి చనిపోవడం, జీవన సంఘర్షణ, వానాకాలం చదువు గురించి పాల్‌గారికి చెప్పాను. తరువాత ఇంటి నుంచి ఆయన పారిపోవడం, దేశాటన, సన్యాసం, కె.డి.పేట చేరడం, ఉద్యమానికి పునాది గురించి కూడా బ్రీఫ్‌గా చెప్పాను.

అంతా విని ఒక ప్రశ్న వేశారు పాల్‌గారు.

''అంటే రామ్రాజు రివోల్టు ఆనందమఠంలో సన్యాసులు నడిపినలాంటి రివోల్టా?''

అప్పుడు చెప్పాను.

''రామరాజు తపస్సు పేరుతోనే మన్యానికి వచ్చాడు. కాని, ఆయన ఆధ్యాత్మిక చింతన విడిచిపెట్టి, ఆయుధాన్ని పట్టేట్టు చేసినవాడు గూడెం డిప్యూటీ తహశీల్దారు బాస్టియన్. ఉద్యమం మొదలయ్యాక రాజు కాషాయం వదిలి ఖాకీడ్రెస్ ధరించాడు. మిలిటరీ వేషం, మెడలో తూటాల పట్కా, చేతిలో బాణం కాక, తుపాకీతో రాజును చూసినవాళ్లు ఇప్పటికీ కె.డి.పేటలో ఉన్నారు.

''మైదానాల నుంచి వచ్చినవాడు ఒక గిరిజన పోరాటానికి నాయకత్వం వహించడం నిజంగా అరుదైన సంగతే!'' అన్నారు పాల్.

కృష్ణదేవిపేటలో సీతారామరాజు స్మారక మందిరాన్ని చూసి, నిజంగా చలించిపోయారు పాల్.

మన్యానికి నడిబొడ్డులాంటి ఈ కొండ గ్రామంలో ఒక లోతట్టు ప్రాంతంలో కట్టారు ఆ సముదాయాన్ని.

రెండున్నర సంవత్సరాలు ఉద్యమం సాగిందని, దాదాపు అరవై నాలుగు పర్యాయాలు ఇరుపక్షాలకి మధ్య యుద్ధం జరిగిందని, చివరికి మంప అనేచోట రాజును అరెస్టు చేశారని చెప్పాను. ఆరోజే కొయ్యూరులో అస్సాం రైఫిల్స్ దళం అధిపతి గూడాల్ రాజును కాల్చి చంపారని, కాని శవాన్ని ఇక్కడికి తెచ్చి దహనం చేశారని పాల్‌గారికి వివరించాను. నెత్తురోడుతున్న శవాన్ని ఊరేగిస్తూ తీసుకొచ్చిన సంఘటన, ఇలా చేసి గిరిజనులను భీతావహులని చేసిన వైనం, రామరాజు ఎక్కడైతే పంచాయితీ తీర్చేవాడో, సరిగ్గా అక్కడే శవ పంచాయతీ జరిపిన సంగతిని విని, పాల్ కదిలిపోయారు.

విశాలమైన ఆవరణ, ఎత్తుపల్లాల కొండనేలని చాలా చక్కగా మలుచుకున్నారు. చుట్టూ కొండలు, మధ్యలో తోరణంతో ప్రహారీ, అందులో నీడ కోసం పెంచిన యూకలిప్టస్ చెట్లు, వాటి కింద సిమెంట్ బెంచీలు, తోరణం కింద నుంచి లోపలికి అడుగు పెట్టగానే ఎదురుగా టోంబ్ ఆకారంలో ఒక మండపం, అందులో రాజు బస్ట్ సైజు విగ్రహం. మండపం వరకు సిమెంట్ బాట. దానికి రెండువైపులా సున్నం వేసిన ముక్కోణపు ఇటుకలు. మండపానికి కొంచెం వెనక కమ్యూనిటీ హాలు, కుడిపక్కన రాజు, గంటం దొరల సమాధులు. ప్రాంగణానికి ఎదురుగా సన్నగా తాండవ ప్రవాహం... పాల్‌గారు ఎన్ని ఫోటోలు తీశారో లెక్కలేదు.

అక్కడ నుంచి చింతపల్లి వెళ్లాం. పాడేరు రూట్లో నలభై రెండు కిలోమీటర్లు. ఇందులో సగం ఘాట్‌రోడ్డు. అదే రంపుల ఘాట్. అల్లూరి సేనానులు గంటం దొర, మల్లుదొరల స్వగ్రామం బట్టి పనుకుల. దానికంటే ముందు మల్లుదొర పట్టుబడిన నడింపాలెం గ్రామాల మీదుగా వెళ్లింది కారు. ఘాట్ రోడ్డు దాటాక నీళ్లకోసం కారు ఆపాడు డ్రైవర్.

దిగి చూస్తే అదే- పెద్దవలస గ్రామం.

రామరాజు ఉద్యమానికి ఈ ఊరే ఊపిరి పోసిందని, ఆశ్చర్యంగా మళ్లీ ఊపిరి తీసిందని పాల్‌గారికి చెప్పాను. నాయకులని ఈ ఊరివాళ్లే పట్టి పోలీసులకి అప్పజెప్పారు.

పక్కనే చింతపల్లి. ఆయుధాల కోసం రామరాజు కొట్టిన తొలి పోలీస్‌స్టేషను వున్నట్టు చెప్పే చోటు చూపించాను. ఇప్పుడు కూడా ఆ చోటే పోలీసు క్యాంప్.

చింతపల్లి కాస్త టౌను వాసన కొడుతుంది. ఆఫీసులు, కమర్షియల్ కాంప్లెక్సులు, గెస్ట్‌హౌస్‌లు ఎక్కువే.

అక్కడే టీ తాగుతూ అడిగారు పాల్.

''దాచేరు సేరు బుడియా అంటే ఏమిటో తెలుసా?''

ఆ మాట ఆయనకు ఎలా తెలిసిందో నాకు అంతుపట్టలేదు.

ఈ ప్రాంతం గిరిజనులు చేసుకునే పండగలో ఆ పదాలనే కొండ పడుచులు రాగయుక్తంగా పాడుతూ బాటసారులని డబ్బులు అడుగుతారు. అదే ఇటుకల పండగ. ఈటెల పండుగని కూడా అంటారు. గంధం అమావాస్య తరువాత మన్యంలోని ప్రతి పల్లెలోను గురువారం నుంచి గురువారం దాకా ఈ పండగ బ్రహ్మాండంగా జరుగుతుంది. నిజానికి అదో వీరోచిత వేడుక కూడా. గిరిజన పడుచుల ఉయ్యాల జంపాల, యువకుల వేట, తాగినంత తాగి, తిన్నంత తిని చేసే థింసా నృత్యం ఈ పండగ ప్రత్యేకతలు. ఈ సమయంలోనే ఆడవాళ్లు 'దాచేరు సేరు బుడియా' అంటూ డబ్బులు అడిగి, ఇవ్వకపోతే పేడనీళ్లు చల్లుతారు. ఇవాళ్టికీ అంతే!

అసలు ఈ మాటేకాదు, ఇక్కడి గ్రామాల పేర్లన్నీ ఆయన ఏకరువు పెడుతున్నాడు. అయితే అస్సామీ ప్రభావం మహా ఇబ్బందిగా వుంది. నవ్వూ తెప్పిస్తున్నది. కృష్ణదేవిపేట, మంప, గూడెం, లంబసింగి, డౌనూరు, మాకవరం కొంగసింగి, ధారమఠం... ఏదయినా సరే పరిచయం వున్నట్టే చెబుతున్నారు. అందుకే ఆశ్చర్యం. ఇవన్నీ రామరాజు ఉద్యమ గమనంలో కనిపించేవే మరి!

సూర్యుడు పశ్చిమానికి వాలుతున్నాడు.

చింతపల్లి నుండి డౌనూరు- లంబసింగి ఘాట్ మీదుగా నర్సీపట్నం బయలుదేరాం.

ఎర్రటి సంధ్యకు ఎదురుగా ఘాట్‌రోడ్డు దిగడం ఓ అపురూపమయిన, అరుదయిన అనుభవం!

కాని, ఈ రోడ్డు నిర్మాణం గిరిజన పోరాటాల చరిత్రలో ఒక నెత్తుటి పుట. ఓ కన్నీటి వాక్యం. కరువుతో అలమటిస్తున్న గిరిజనుల చేత కొరడా దెబ్బలతో తోళ్లు వొలిచి నిర్మింపజేశాడు బాస్టియన్. నిజానికి ఈ రోడ్డే రాజు ఉద్యమానికి బాట వేసింది.

రాత్రి నర్సీపట్నం గెస్ట్‌హౌస్‌లో బడలికగా పడుకున్నారు పాల్. పైగా డిన్నర్ తర్వాత ఒక పెగ్ కూడా బిగించారు. చాలా తాపీగా సిగరెట్ తాగుతూ రిలాక్స్ అవుతున్నారు. అప్పుడు నెమ్మదిగా కదిపాను.

"మీరు, మీ ఫ్యామిలీ ఎప్పుడైనా ఇటొచ్చారా మాస్టారూ!"

"మా ఫాదర్ వచ్చార్లెండి!"

"ఆయనతో మీరెవరూ రాలేదా మరి!"

"నేను పుట్టి భూమ్మీద పడేసరికి మా ఫాదర్ ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయారు. అయామ్ ఎ పాస్తుమస్ సన్."

"మరి ఈ ఊర్లు, వాటి పేర్లు...?"

"మా ఫాదర్ డైరీలో వున్నాయిలే. ఇంతకీ నీకు చెప్పలేదు కదూ! మా ఫాదర్ పోయిందిక్కడే!"

"ఇక్కడా? ఎప్పుడు సార్?"

"నైన్టీన్ ట్వెంటీ ఫోర్. ఏప్రిల్. అంటే ఆ యంగ్ సన్యాసి సీతారామ్రాజ్ మూవ్‌మెంట్‌లోనే."

ఒక్కసారిగా నిటారుగా అయ్యాను. లిప్తకాలం నిజంగా మూగపోయాను.

తరువాత ఆయనే లేచివెళ్లి తన బ్యాగ్‌లోంచి చిన్న పెట్టెలాంటిది తెచ్చి నా చేతికిచ్చాడు.

ఎర్రటి క్లాత్ వేసి బైండ్ చేసిన డైరీ. నల్లటి నొక్కుడు బటన్ లాగితే రెండు అట్టలు విడివడ్డాయి. డిటెక్టివ్ నవల సైజులో బాగా మందంగా వుంది. ఎంత పాతదో! మా స్కాలర్లందరికీ బాగా పరిచయమైన పాత కాగితాల వాసన.

"ఆయన కొయ్యూరు పోలీసు క్యాంప్‌లో వుండగా పోయారట. అంత్యక్రియలు కూడా అయిపోయాయని మాత్రమే మా మదర్‌కి ఇన్‌ఫార్మ్ చేశారట. ఆ తర్వాతే కొంత డబ్బు ఒక పెన్ను, ఆయన హోల్డాలు, ఇదిగో ఈ డైరీ ఆవిడకి అప్పజెప్పి వెళ్లారట. మా ఫాదర్ ఫ్రెండ్స్ చెప్పినదానినిబట్టి ఆయన అదేదో ఏజెన్సీ జ్వరంతో హఠాత్తుగా పోయారు. ఓకే... గుడ్‌నైట్... బాగా టైరయ్యాను. పడుకుంటా. ఓపికుంటే చదువు."

చాలామందికి తెలియదు. రామరాజు పోరాటంలో చనిపోయిన భారతీయులని వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. ఎవరైనా సరే భారతీయుడిని చంపకూడదని చాలా ఖచ్చితమైన నిబంధన పాటించాడు రాజు. దీనికి ఎన్నో ఆధారాలున్నాయి కూడా.

కళ్లు మూశాడు పాల్. చిన్నగా గురక మొదలైంది.

డైరీ తెరిచాను.

అక్కడక్కడ అస్సామీ, బెంగాలీ పదాలతో మొత్తం ఇంగ్లీషులో రాసిన డైరీ. తొలిపేజీ మీద 'జోసెఫ్ డేనియల్, అస్సాం రైఫిల్స్,' అని వుంది.

'పందొమ్మిది వందల ఇరవై నాలుగు,' అని ఓల్డ్ ఇటాలిక్స్ అంకెలు కూడా ఆ పేజీపైనే వున్నాయి.

జనవరి నుంచి ఏప్రిల్‌లో కొన్నిరోజుల వరకూ రాసుకున్నారు. అందుకే చదవడం పెద్ద కష్టం కాలేదు.

జనవరి 27న అస్సాం రైఫిల్స్ నర్సీపట్నం చేరడం, అక్కడ నుంచి ఉరట్ల మీదుగా, జోగంపేట మీదుగా కె.డి.పేట వెళ్లడం డైరీలో వర్ణించారు. ఇక అన్ని పేజీలు మన్యంలో జీవితం గురించే చెబుతున్నాయి. తన పని, పోలీస్ క్యాంప్‌ల వివరాలు, చుట్టుపక్కల గ్రామాలలో పెట్రోలింగ్, ఈటెల పండగ, జాకెట్టు లేని కొండ స్త్రీల వర్ణనలు, హేళనలు, పై ఆఫీసర్ల మీద అసభ్యమైన కామెంట్లు, ఉత్తరాల ప్రస్తావన- అన్నిటి గురించి స్వేచ్ఛగా, నిస్సంకోచంగా రాసుకున్నారు.

*

"ఇదేనా కొయ్యూరు?"

డ్రైవర్‌ని అడుగుతున్నారు పాల్.

చటుక్కున ఈలోకంలోకి వచ్చి డ్రైవర్ చేత కారాపించాను. టిఫిన్ చెయ్యడానికి దిగాం.

అచ్చమైన ట్రైబల్ విలేజి కొయ్యూరు. లేడికళ్లతో పోటీపడే బెదురుచూపుల కొండ పడుచులని ఇక్కడ నుంచే ఎక్కువగా చూడొచ్చు. కంటెలు, కడియాలు, అడ్డబాసలు, పచ్చబొట్లు- ఇప్పటికీ మారని కట్టు, బొట్టు, ముదురు రంగులవీ, ముతకవీ అయిన ఒంటి పొర చీరల్లో కండ ఏమాత్రం జాడలేని గిరిజన స్త్రీ శరీరం ఒద్దికగానే ఇమిడి వుంది. కురచ జుట్టు, పల్చని పెదవులు, ఎప్పుడూ సంభ్రమాశ్చర్యాలను పరికిస్తున్నట్టుండే కళ్లు. అంతగా రోమాలు కనబడని ఛామనఛాయ ఒళ్లు. అక్కడ ఏ కొండవాడిని చూసినా, ఒకే మూస నుంచి వచ్చినట్టు వుంటారు.

పాకలలో నాలుగయిదు కాకా హోటెళ్లున్నాయి. గిరిజనులు కూడా వాళ్ల సాంప్రదాయిక ఆహారపు అలవాట్లు మార్చుకున్నారేమో. టీలు, టిఫిన్లు కొనుక్కొని వెళుతున్నారు. ఇక్కడే బస్సులూ ఆపుతారు. అందుకే హడావుడి. శుచి మాటేమోగాని చాలా రుచిగా వుంది టిఫిను.

ఇక్కడ నుంచి కొన్ని అడుగుల ముందుకెళ్లి కుడి వైపు తిరిగితే సీతారామరాజుని కాల్చి చంపినట్టు చెప్పు కునే చోటు. అక్కడ కట్టిన స్మారక చిహ్నాల సముదాయం కనిపిస్తాయి. దానంతా పెద్ద పెద్ద చింతచెట్లు.

ఇది కూడా చాలా విశాలమైన ప్రాంగణమే.

రామరాజుని తుపాకీతో కాల్చి చంపారని చెప్పుకునే చోటు. అది కూడా చెట్టుకు కట్టి ఒక మండపం నిర్మించి అందులో రాజు బస్ట్ విగ్రహం పెట్టారు. కొద్దిగా అవతల ఒక ధ్యానమందిరం, ఒక కమ్యూనిటీ హాలు వున్నాయి. హాలులో గవర్నమెంట్ లైబ్రరీ వుంది. ఇంకా టైం కాలేదు. అన్నింటికీ తాళాలు వేసున్నాయి.

ఇప్పుడే ఏడు దాటింది.

కారు డిక్కీ మీద మోచేతులు ఆన్చి చింతచెట్ల కొమ్మల్లోకి ధారగా దిగుతున్న తొలికిరణాలని చూస్తున్నారు పాల్.

"ఒక్క సహాయం చేయగలరా?" నెమ్మదిగా అన్నారు పాల్.

"చెప్పండి మాస్టారు! దానికేం?"

"నా సెంటిమెంటో, లేదా అమ్మ తీరని కోరిక అన్న భావమో, ఏదైతేనేం. రామరాజు మూవ్‌మెంట్ సమ యంలో చనిపోయిన వాళ్ల సమాధులు ఎక్కడున్నాయో వాకబు చేయండి. వాటి మధ్య మా ఫాదర్ సమాధి వుండొచ్చు. ఇంత దూరం వచ్చాను. ఒక్కసారి చూసి వెళ్లాలని వుంది."

మా ప్రయత్నంగా మళ్ల రోడ్డు దగ్గరికొచ్చి ఎంక్వైరీ మొదలుపెట్టాం. సమాధులూ అంటే చాలు కె.డి.పేట వెళ్లమనేవాళ్లే అంతా.

'అన్నట్లు లైబ్రేరియన్ నాయుడు గారిని కను క్కుంటే!' అనిపించింది నాకు. గతంలో కలిసినప్పుడు కొన్ని సంగతులు చెప్పగలిగారాయన. ఈ సమాచారం ఆయనకి తెలియడం ఖాయం. కానీ నాయుడుగారు రావాలంటే గంటపైనే పడుతుంది. ఇంతలో మంప వెళ్లి వస్తే సరి. ఈ యాత్ర పరిపూర్ణమవుతుంది.

అదే చెప్పాను పాల్‌గారికి.

కొయ్యూరు నుంచి ఆరుమైళ్లు. మట్టిరోడ్డే కానీ, అచ్చమైన అడవిదారి. అంతా ఎగుడుదిగుడే. మధ్య మధ్య పిల్లకాలువల్లా అడ్డంగా చిన్న చిన్న జలలు. కొంత కాలం క్రితం కూడా దారంతా వెదురుపొదలేనని చెబుతారు. బస్సొచ్చాక నయంట. నెమ్మదిగా వెళుతోంది కారు.

సీతారామరాజు లాంటి చరిత్ర పురుషుడి జీవితపు అంతిమ క్షణాలకీ, ఇవాళ్టికీ జనం ఆరాధిస్తున్న నిజమైన హీరో చరిత్రలో అంతిమ దృశ్యానికీ, చరమాంకానికీ మౌనసాక్షి ఈ బాటేనన్న సంగతి తలుచుకుంటే వింతగా అనిపిస్తోంది.

తన ఉద్యమం ఫలితంగా జరిగిన హింస, ధన మాన ప్రాణాల దోపిడీ ఆ ఆఖరి క్షణాలకి ముందు తల పోసుకుని, సమీక్షించుకుని రామరాజు లాంటి సమర శీలి సంశయాత్ముడయినది ఈ మంపలోనే. నిజంగా ఎంత హింస! ఎంత పైశాచికానందం! ఎంత నిర్బంధం! ఎన్ని మానభంగాలు. ఎంత లైంగిక హింస! బాస్టియన్ కాలం నాటి గవర్నమెంటు డాక్టరు రాసుకున్న డైరీలో సంఘటనలన్నీ వీటికి అక్షర రూపాలే!

కానీ, రాత్రి చదివిన పాల్‌గారి తండ్రి డైరీలోని ఆ సంఘటన నన్ను వెంటాడుతోంది. ఆ అక్షరాల వెనుక ఎవరో నిస్సహాయంగా వెక్కివెక్కి ఏడుస్తున్న చప్పుడు... ఒక తండా గుండె పగిలిన సవ్వడి... వీటి నుంచే నా మనసు తప్పించుకోలేకపోతుంది.

ఎంత అహంకారం ఆ రాతల్లో! పరాజితులు, నిస్స హాయుల దైన్యాన్ని చూస్తే ఎంత హేళన! ఇదంతా ఆ ఏడెనిమిది పేజీలలోనే-

*ఏప్రిల్ 3: ఆ క్షణంలో ఆ ఆడవాళ్లని, వాళ్లని వాటేసుకుని బిక్కుబిక్కుమంటూ చూసే ఆ బక్కపిల్లల్ని చూస్తే కొంచెం జాలేసేది. కానీ, వీళ్లే పితూరిదార్లకి ఆశ్రయం ఇస్తారు. భోజనం పెడతారు. ఇది గుర్తొస్తే కసి. దానికితోడు నెలల తరబడి లేని ఆడస్పర్శ. కొయ్యూరు పోలీసు క్యాంప్‌కి పశ్చిమంగా, ఏకాంతంగా వుందా ట్రైబల్ విలేజి. గంట నడవాలి. ఆ ఏడుగురమే ఎప్పుడూ. కె.డి.పేట నుంచి వచ్చిన వైర్‌లెస్ సమాచారాన్ని పట్టు కుని ఓ రోజున కొండల్లో పెట్రోలింగ్ జరుపుతూ వుంటే అనుకోకుండా కంటపడిందా పల్లె. పితూరీదార్లని వెతు కుతూ మా పెట్రోలింగ్ పార్టీ ఓ కొండపైకి ఎక్కాం. అక్కడ నుంచి చుట్టూ చూశాం. కాస్త దిగువన చెట్ల మధ్య నుంచి లేస్తోంది పొగ. పితూరీదార్లు వంట చేసు కుంటున్నారన్నాడు జమేదార్. వెంటనే ఆ వైపు పరు గెత్తాం. కానీ, గంట పట్టింది ఆ చోటుకి చేరేసరికి. పది, పన్నెండు గుడిసెలతో ఒక చిన్న పల్లె.*

*జమేదార్‌గాడు గాల్లోకి కాల్చాడు తుపాకీ. ఒక్క తూటాయే. పిరికి వెధవలు. మగాళ్లంతా కొండల్లోకి పారిపోయారు. వీళ్లా! పితూరీలు నడిపేది! ఆడవాళ్లు. పిల్లలే మిగిలారు. ఇద్దర్ని అక్కడ కాపలా పెట్టి కొండల్లో గాలించాం. ఎవరూ దొరకలేదు. రాంగ్ ఇన్ఫర్మేషన్. రెండవుతోంది. ఎండ మాడుస్తోంది. ఇంక వెతకబుద్ధి కాలేదు. కూడబలుక్కుని మళ్లీ అక్కడికే చేరాం. మా వాళ్లిద్దరూ కొండ గొర్రెలని బెదిరించి భోజనాలు రెడీ చేయించారు. అందరూ తిన్నాం. అప్పుడు మరో ఆకలి...*

*జమేదారుగాడే మొదలెట్టాడు. వెధవ, మామూలుగా కుక్కబుద్ధిగాడే గానీ, ఆడవాళ్ల దగ్గర, వాళ్లని పంచుకోవడం దగ్గర మహా ఉదారంగా వుంటాడు. ఒకర్తెని పిలిచాడు. తెగ గింజుకుంది. వాడే లేచివెళ్లి తుపాకీ మడంతో డొక్కలో పొడిచాడు. కిందపడి గిలగిల తన్నుకుంటూ వుంటే గుండె పై చీర పక్కకి తొలగిపోయింది. రొమ్ముల మధ్య తుపాకీ మడం పెట్టి నొక్కాడు. తరువాత అదే కాదు, ఏ ఒక్కతీ కిక్కురుమనలేదు. మాకు సైగ చేశాడు. ఒక్కొక్క గుడిసెలోకి దూరాం. అడవి మనుషులు వాళ్లు. జంతువుల మాదిరిగానే అదో రకం వాసన. అయినా ఆడవాళ్లు...*

*చీకట్లు ముసురుతుండగా కలిసి బయలుదేరాం. కొంతదూరం దిగాం కొండ. వెనక నుంచి ఒక్కసారిగా వినిపించాయి ఏడుపులు. ఒక్కొక్క గుడిసె నుంచి ఒక్కొక్క ఆడది వచ్చి ఒకళ్ల మీద ఒకళ్లు పడి ఏడవడం ఆ సంధ్య చీకట్లో స్పష్టంగా కనిపించింది.*

*ఎవరో గాల్లోకి పేల్చారు తుపాకీ.*

*ఎక్కడి ఏడుపులు అక్కడే గప్‌చుప్!*

*వాళ్ల భయాన్ని చూసి కడుపుబ్బిపోయేటట్టు నవ్వుకుంటూ క్యాంప్‌కి వచ్చాం.*

*అప్పటి నుంచి ఆడది గుర్తొస్తే, ఏడుగురం కూడబలుక్కుని వెళుతున్నాం.*

*పేరుకి పెట్రోలింగ్. ఒకటో రెండో హీలియో ల్యాంప్‌లు, భుజాల మీద ఎమ్యునిషన్. గంట నడక, చివరికి నాల్గయిదు గంటల మజా.*

*బెదురుచూపుల ఆడాళ్లతో సెక్స్ పసందుగా వుంటుందనేవాడు కుక్కబుద్ధిగాడు. కానీ, మరీ క్రూరుడు. పితూరీదార్లు రాత్రిళ్లు సంచరించేవారు. మమ్మల్ని కూడా తిరగమన్నారు. ఆ రాత్రి ఏడుగురం కూడి అక్కడికే చేరాం. వాడికి నాలుగేళ్లుంటాయి. మా హడావిడికి లేచి పక్కలో తల్లికోసం వెతికాడు. కనిపించలేదు. ఆ చీకట్లోనే అరుచుకుంటూ అడవివైపు వెళ్లిపోయాడు. జోకేమిటంటే వాడి తల్లి కుక్కబుద్ధిగాడి చేతిలో వుంది. అది పిల్లాడిని పిలిచి చీదర చేయకుండా నోరు నొక్కి వుంచాడు.*

*అదెవర్తో మమ్మల్ని చూసి, పిచ్చిదానిలా నటించడం మొదలుపెట్టింది. మా దగ్గరా నాటకాలు! మాది మదపిచ్చి. ఓ సార్జెంట్ చేతిలో పిచ్చిపిచ్చిగా నలిగిపోయింది.*

*రెండు మూడు రోజులకొకసారయినా పెట్రోలింగ్ జరిగిపోతూనే వుంది. ఇప్పటికి రెండు మాసాల నుంచి భలే మజా!*

*

కీచుమంటూ స్లోగా ఆగింది కారు.

"ఎలా పోవాలి సార్?" అడిగాడు మా డ్రైవరు.

చుట్టూ చూశాను. మంప పొలిమేరల్లో ఆగి వుంది కారు. కొంచెం అవతల ఈమధ్యనే నక్సలైట్లు పేల్చేసిన స్కూలు బిల్డింగ్ కనిపిస్తోంది.

అక్కడ నుంచి ఆ స్మారకస్థూపం దగ్గరికి వెళ్లడానికి ఇంకో ఆరేడు నిమిషాలు పట్టింది.

విశాఖ జిల్లాకి దాదాపు చివరన వున్న గిరిజన పల్లె. ఆ వైపు సరిహద్దుగా చేలు. చేలకి ముందు పెద్దపెద్ద చింతచెట్ల వరస. ఇక్కడే కారాపి చేలల్లోకి నడిచాం. వాటి మధ్య కట్టారు స్థూపం. రామరాజు అక్కడే పట్టుబడ్డాడంటారు. చుట్టూ ప్రహరీ. లోపల ఒక ధ్యానమందిరం. ఆ లోపల రాజు విగ్రహం. చేల మధ్య నిర్మాణం గంభీరంగా కనిపిస్తోంది.

పావుగంట గడిపి వెనుతిరిగాం.

ఎవరు చెప్పారో, మా కోసమే ఎదురుచూస్తున్నారు లైబ్రేరియన్ నాయుడుగారు.

నేను చెప్పింది విన్నారు నాయుడు.

తరువాత చెప్పింది విన్నాక, 'వెళ్లగలమా,' అనిపించింది.

సమాధులున్నట్లు వినడమేగాని, ఆయన చూడలేదట. ప్రయాణం గంటపైనే. కానీ, కారు వెళ్లదట, అయినా సిద్ధపడ్డారు పాల్.

నేను కారులోంచి కూల్‌కెగ్ తీశాను.

పాల్‌గారు బొకే తీసి పట్టుకున్నారు.

అప్పుడర్థమైంది నాకు- బొకే ఎందుకో.

దారిలో చాలా సంగతులే చెప్పారు నాయుడు. తండా పల్లెగా మారిందట. మట్టిరోడ్డు పడిందట. ఊరికి కాస్త ఎగువన కొన్ని సమాధులున్నాయని వినికిడి అట. కానీ, నాయుడుగారు చెప్పినదాంట్లో ఇవేవీ కాదుగానీ, మిగిలిన మన్యం ఈ పల్లెని వెలివేసినట్టు చూస్తుందని చెబుతారంటూ ఆయన బయటపెట్టిన సంగతే నన్ను ఆకర్షించింది. ఆ పల్లెలో వాళ్లు విశాఖ కొండవాళ్లలా వుండరట.

పాల్ అలిసిపోతున్నా కష్టపడి నడుస్తున్నారు. ఒక రకమయిన మూడ్‌లో వున్నట్టు కనిపిస్తున్నారు. అసలు కొయ్యూరు వచ్చినప్పటి నుంచి అలాగే వున్నారు.

గంటకు పైగా నడిచి వుంటాం.

కొద్దిదూరంలో పల్లె కనిపిస్తుండగా అక్కడ కట్టారు చిన్న స్కూల్ బిల్డింగ్. నాయుడుగారు తన పరపతితో బిల్డింగ్ అరుగుపైన ఒక కుర్చీ వేయించి పాల్‌గారిని కూర్చోబెట్టి సమాధుల భోగట్టా కోసం వెళ్లారు.

అదో సింగిల్ టీచరు స్కూలు. చేతిలో పెద్ద బొకేతో టిప్‌టాప్‌గా టక్ చేసుకున్న ఆ పెద్దాయన్ని చూడ్డానికి ఒకరి తర్వాత ఒకళ్లు వస్తున్నారు పిల్లలు.

పిల్లల్ని చూశాక పాల్‌గారి ముఖం విప్పారింది.

పాల్‌గారు ఆక్స్‌ఫర్డ్ శైలిలో వాళ్లని ప్రశ్నిస్తున్నారు. ఆ పిల్లలు ఒరియాని మరిపించే తెలుగులో మెలికలు తిరుగుతూ ఏదో చెబుతున్నారు.

ఆ తమాషా ఎంతోసేపు సాగలేదు. మొత్తానికి భాష సమస్య పాల్‌గారిని మౌనంగా కూర్చోమని శాసించింది.

మగపిల్లలు నిక్కర్లు, గోచీలు వాటిపైన చొక్కాలు వేసుకున్నారు. ఆడపిల్లలు మాత్రం సంప్రదాయ గిరిజన కట్టుబొట్టులోనే కనిపిస్తున్నారు. దానితోపాటు ఆ ముఖాలలో కనిపించే అమాయకత్వం ఒకటి.

ఆ కడియాలు, చెవిపోగులు, ముక్కు పుడకలు, పచ్చబొట్లు- అంతా మన్యం సంస్కృతి.

కానీ, ఆ గుంపంతా ఒక్కలా లేదు. మధ్యమధ్య కనిపిస్తున్న ఆ పిల్లల్లో ఏదో భేదం. ఎక్కడి పిల్లలికో ఫ్యాన్సీ డ్రెస్ వేసినట్టు భావన.

ఆ వేషం మాటున దాక్కున్న పోలికల కోసం, ముద్రల కోసం నాకంటే ముందే పాల్‌గారి కళ్లు అన్వేషిస్తున్నాయి అప్పటికే. వాటిని పోల్చుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు పాల్‌గారికి.

ఒక సత్యం బోధపడినట్లు కొన్ని క్షణాలు నిశ్చేష్టులై వుండిపోయారు పాల్.

తరువాత చెప్పాచెయ్యకుండా చటుక్కున అరుగు దిగిపోయారు. పల్లె వైపు అడుగులు వేస్తుంటే ఆయన్ని అనుసరించక తప్పలేదు నాకు.

కుడిచేతిలో వాకింగ్ స్టిక్, ఎడంచేత్తో బొకేని గుండెకు అదుముకుని నడుస్తున్నారు పాల్. దారిలో ఎవరు కనిపించినా, పరికించి చూస్తున్నారు. వృద్ధుల నయితే మరీ మరీ పరికించి చూస్తున్నారు. కొందరి ముఖాలలో స్పష్టంగా కనిపిస్తున్న ముద్రలతో పాల్‌గారు చకితులవుతుంటే, అంత పెద్దాయన, నాగరీకుడు అలా చూస్తూ పోవడం ఆ ప్రాంతం వాళ్లకి మరీమరీ వింతగా కనిపిస్తోంది.

ఆడవాళ్లు, మగవాళ్లు, పిల్లలు అరుగుల మీద కొచ్చి మరీ చూస్తున్నారు వింతని. కనిపించిన ప్రతి ముఖాన్ని అలా చూస్తూనే ముందుకెళుతున్నారు పాల్.

అంతలో నాయుడుగారొచ్చి రక్షించారు. లేకపోతే ఇంకెంత దూరం వెళ్లిపోయేవారో!

''సార్! నాయుడుగారొచ్చారు వెళ్దామా!''

పాల్‌గారితో అన్నాను గట్టిగా.

''ఆ... ఔను కదూ! లెటజ్ గో!''

దాదాపు నిద్ర మేల్కొన్నవాడిలాగే అన్నారు పాల్.

ముగ్గురం స్కూలు దగ్గరకొచ్చాం.

అక్కడ నుంచే ముందుకు పోవాలి. బడిపిల్లలు ఇంకా బయటే నిలబడి కబుర్లు చెప్పు కుంటున్నారు.

''ఇలా వెళ్లాలి! ఇంకో పది నిమిషాలు సార్. రండి!''

నాయుడుగారు దారి చూపిస్తుంటే, నాలుగడుగులు వేసి, ఏదో గుర్తొచ్చినట్టు వెనతిరిగారు పాల్.

ఒకటో తరగతో, రెండో చదువుతూ వుండాలి ఆ చిన్నపాప. చింపిరితల, నాచురంగు చీరముక్కని విశాఖ మన్యపు స్త్రీలు కట్టుకున్నట్టు కట్టారు. ఆ పిల్లే పాల్‌గారి కేసి దీక్షగా చూస్తోంది.

ఆ పిల్లనే దగ్గరికి రమ్మని సైగ చేశారు పాల్.

సిగ్గుపడిపోయింది.

మళ్లీ పిలిచారు ఆప్యాయంగా.

ఈసారి బొకేని ముంజేతుల పైన పట్టుకుని ముందుకు చాచి తీసుకోమన్నట్టు సైగ చేశారు.

లేడిలా చెంగున దూకి వచ్చేసింది.

పొడవాటి కొమ్మలతో, విరిసీవిరియని ఎర్రటి మొగ్గలతో, ఆకులతో, పసుపురంగు రిబ్బను కట్టుతో. తళుకు బెళుకు ప్లాస్టిక్ కాగితంలోని ఆ ఖరీదయిన బొకేని ఆ చిన్నారి చేతుల్లో పెట్టారు సార్.

'నాకేనా!' అన్నట్టు ఒక్కసారి పాల్ కళ్లలోకి చూసి ఆ బొకేని గుండెలకి హత్తుకుని, అపురూపంగా చూసుకుంటున్నదా కొండపిల్ల.

తరువాత ఆ చింపిరితలనే నిమిరారాయన.

''ఇక్కడికి ఇంకో ఫర్లాంగు దూరమేనట సార్! సమాధులున్నాయట కానీ, చాలావరకు శిథిలమయ్యాయట. వివరాలు కూడా చెక్కారట పైన...''

అంటూ ఆయన జవాబు కోసం చూశాను.

ఆ పిల్లని అలా చూస్తూనే వెనుతిరిగిపోయారు ప్రొఫెసర్ పాల్.

మాట వినిపించలేదేమోనని మళ్లీ అదే చెప్పాను.

ఊహూ ఆగలేదాయన.

చేతిలోని కర్రని తాటిస్తూ వడివడిగా అడుగు లేస్తున్నారు పాల్ వచ్చిన దారినే...

నాలుగడుగులు వేస్తున్నారు. ఆగి టాటా చెబుతున్నారు. మళ్లీ నాలుగడుగులు... ఇంకోసారి ఆ పిల్లల వైపు చూస్తున్నారు. నాలుగడుగులు వేయడం, ఆగడం, చూడటం...

అలా చూసినప్పుడు మాత్రం పాల్‌గారి కళ్లనిండా క్షమార్థన.

*ప్రజాసాహితి మాసపత్రిక, జూన్ 1998*